## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : డి. ఎస్. పి. మురళీమోహన్



**రావులపాలెం , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** గణపతి నవరాత్రి ఉత్సవాలు, నాయకుల జన్మదిన వేడుకల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో గురువారం ఆయన రావులపాలెంలో టౌన్, రూరల్ సిఐలు ఎం.శేఖర్ బాబు, సి.హెచ్. విద్యాసాగర్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, ఫ్లెక్సీలు ముద్రించే సంస్థల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మురళీ మోహన్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో వినాయక చవితి సందర్భంగా 728 విగ్రహాలు ఏర్పాటు చేసారని, ఉత్సవ కమిటీలు భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలే కానీ, డీజేలు, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఊరేగింపులు, ఉత్సవ మండపాల వద్ద సినిమా పాటలు వేయడం, అశ్లీల నృత్యాలు ఏ మాత్రం హర్షణీయం కాదన్నారు. ఈ విధానంలో మార్పు రావాలన్నారు. గోదావరి నది, కాలువల్లో ప్రవాహం ఉధృతంగా ఉన్నందున గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి 9 గంటల వరకు మాత్రమే రేవుల్లో నిమజ్జనానికి అనుమతి ఉంటుందన్నారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని, నిబంధనలకు లోబడి కార్యక్రమాలు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఉత్సవాలు ఏ కుటుంబంలోనూ విషాదాన్ని నింపకూడదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రావద్దన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా సదరు ఉత్సవ కమిటీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ దీపాలంకరణ, గణేష్ నిమజ్జనం సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు ఎస్సైలు జి.సురేంద్ర, జి.చంటి, ఎం.రాము, జి.నరేష్, గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, ఫ్లెక్సీ ముద్రణా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ చైతన్య స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం




**కోనసీమ బ్యూరో , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట శ్రీ చైతన్య స్కూల్లో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివరాం మాట్లాడుతూ పిల్లలకు సంస్కారాన్ని, వ్యక్తిత్వాన్ని,విద్యను, విజ్ఞానాన్ని ,దేశభక్తిని పెంపొందించేది ఒక గురువు మాత్రమే అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి దేశంలోనే అత్యున్నత స్థానం రాష్ట్రపతి పదవిని అధిరోహించిన స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్చార్జి నరేష్, సి ఇంచార్జ్ ప్రసాద్, ప్రైమరీ ఇన్చార్జ్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## ఏపీఐడీసీఎల్ డైరెక్టర్ బాలభారతికి అభినందనలు



**అంబాజీపేట , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** ఏపీ రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ( ఏపీఐడీసీఎల్) డైరెక్టర్గా నియమితులైన మట్టపర్తి బాలభారతికి తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. మండలంలోని మొసలపల్లి గ్రామానికి చెందిన బాల భారతి దీర్ఘకాలంగా టిడిపిలో కొనసాగుతున్నారు. మండల తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలుగా పనిచేయడంతో పాటు నియోజకవర్గంలో పలు పదవులు చేపట్టారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ఆమెను గుర్తించి ఏపీ ఐసీడీసీఎల్ డైరెక్టర్గా నియమించడం అభినందనీయమని పలువురు అన్నారు. అనంతరం మొసలపల్లిలోని ఆమె స్వగృహం వద్ద బాలభారతి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీర వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పబ్బినీడి రాంబాబు, నాయకులు దంతులూరి శీనురాజు, గూడాల ఫణి, పెదపూడి శ్రీనివాసరావు,పళ్ళ శ్రీనివాసరావు,యనమదల రాజబాబు, మంద రాజేష్, యనమదల సాయిబాబా, పితాని ఈశ్వరరావు,మట్టా నాగేంద్ర, కాగితాపల్లి సాయిరామ్, నేదునూరి రమణ బాబు,ఉందుర్తి పరంజ్యోతి, గుబ్బల నాగ వీర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ అడ్వాన్స్ ఇండెక్స్ పై శిక్షణ



**ఆత్రేయపురం సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపించేందుకు, స్థానిక వనరులను వినియోగించుకుని సర్పంచులు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్ అన్నారు. గురువారం ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయితీ అడ్వాన్స్ ఇండెక్స్ పై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సమావేశాన్ని ఎంపిపి కుండా అన్నపూర్ణ, ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్, మండల ఉపాధ్యక్షులు పెన్మెత్స బంగార్రాజులు మహాత్మా గాంధీ, డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించి ప్రారంభించారు. శిక్షణా కార్యక్రమం ఉద్దేశించి ఎంపిపి కుండా అన్నపూర్ణ మాట్లాడుతూ పంచాయితీలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, శానిటేషన్, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు స్థితిగతులు వంటి అంశాలపై గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు కార్యదర్శులు దృష్టి సారించాలని అన్నారు. ఇండెక్స్ ప్రకారం ప్రతి పంచాయితీ యొక్క పురోగతి స్థాయిని పరిశీలించి, వెనుకబడిన పంచాయితీలపై ప్రత్యేక దృష్టి సారించ వలసిన అవసరం ఉందని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం లో ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ మాట్లాడుతూ పంచాయితీ అడ్వాన్స్ ఇండెక్స్ ద్వారా గ్రామాల అభివృద్ధి స్థాయిని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం వలన పారదర్శకత పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. శిక్షణాలో భాగంగా లొల్ల పంచాయితీ కార్యదర్శి కె.ఎస్.ఆర్. కృష్ణమాచార్యులు వివిధ అంశాలపై గ్రామ కార్యదర్శులకు సర్పంచ్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచులు మెర్ల రాము, వేముల శ్రీను, వివిధ గ్రామాల యం.పి.టి.సి.లు, గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వినాయకుని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆనందరావు



**కోనసీమబ్యూరో , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** వినాయక నవరాత్రి మహెూత్సవాల్లో భాగంగా అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ వాసవి అమ్మవారి ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు గురువారం ఉదయం దర్శనం చేసుకున్నారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు నాగబాబు శర్మ తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం గావించారు. అనంతరం సంఘ ఆధ్వర్యంలో శాసనసభ్యులు ఆనందరావు ని సాలువతో సత్కరించారు. ఆయన వెంట ఉన్న తెలుగుదేశం నాయకుడు గిడ్ల వేంకటేష్ ని కండువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, కో చైర్మన్లు పచ్చిగోళ్ళ సోమరాజు, నూలు శ్రీనివాసు, సంఘ ముఖ్య సలహాదారుడు వరదా సూరిబాబు, తదితర కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పంచాయితీ అడ్వాన్స్ ఇండెక్స్ తో ప్రజలకు మెరుగైన సేవలు : ఎంపీడీఓ చంద్రరావు



**గండేపల్లి , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త )** గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్థానిక వనరులను వినియోగించుకుని సర్పంచ్ లు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపిడిఓ కె.చంద్రావు అన్నారు. స్దానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయితీ అడ్వాన్స్ ఇండెక్స్ పై శిక్షణా కార్యక్రమం జరిగింది. పంచాయితీల అభివృద్ధి తదితర అంశాలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్ లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే గిడ్డి

### - 15 నెలల కాలంలో 459 కుటుంబాలకు రూ.3.30 కోట్లు ఆర్థిక సాయం



**అంబాజీపేట (పి.గన్నవరం) , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిరుపేద బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని, పేద కుటుంబాలకు వైద్య పరంగా ఆర్థిక భరోసా కల్పించేందుకు త్రికరణ శుద్ధిగా పనిచేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.పి. గన్నవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన సీఎం రిలీఫ్ ఫండ్ (ఆర్తుల నిరంతర వైద్య సేవ కోసం ఆర్థిక సాయం) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలో నియోజకవర్గంలో 18 దపాలుగా 459 బాధిత కుటుంబాలకు రూ.3,30,48,531 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులు రూపంలో అందజేశామన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వ్యక్తులు అనారోగ్యం పాలై వైద్య చికిత్స కోసం పెట్టిన ఖర్చును సీఎంఆర్ఎఫ్ ద్వారా పర్సంటేజీ రూపంలో అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఇప్పటివరకు ఏ నియోజకవర్గంలోనూ అందనంత సొమ్మును పి. గన్నవరం నియోజకవర్గంలోనే అందజేశామన్నారు. నియోజవర్గంలోని పి.గన్నవరం,అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి మండలాలకు చెందిన 110 కుటుంబాలకు రూ.67, 02,095 లక్షలను అందజేస్తున్నామన్నారు. ఒకే రోజున 110 కుటుం బాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం అందజేయడం రాష్ట్రంలోనే చరిత్ర అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అందని ద్రాక్షగా మిగిలిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంను రెండు కళ్ళుగా భావించి పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి వైసీపీకి లేదన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కులం, మతం,పార్టీ భేదం లేకుండా అర్హులైన నిరుపేదలందరికీ ఒకే న్యాయం పాటిస్తున్నామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. అనంతరం కూటమి శ్రేణులు మాట్లాడుతూ నియోజవర్గంను అభివృద్ధి వైపు నడిపిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు మనమందరం అండగా నిలవాలన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు రప్పించడంలో ఎమ్మెల్యే చాలా కృషి చేస్తున్నారని, ఆయనకు తోడుగా ఆయన పీఏ రమేష్ సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, రిలీఫ్ ఫండ్ చెక్కులు త్వరితగతిన వచ్చేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ఐటి ప్రాజెక్ట్ సలహాదారు పెన్నమ రెడ్డి నాగబాబు,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఏపీఐడీసీఎల్ డైరెక్టర్ మట్టపర్తి బాలభారతి, ఏఎంసి చైర్మన్లు పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్,ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ లు నాగాబత్తుల శాంతకుమారి, బొందాడ నాగమణి,ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు,కూటమి శ్రేణులు డొక్కా నాథ్ బాబు,మద్దాల సుబ్బారావు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, మైపాల తాతాజీ,వాసంశెట్టి కుమార్ ,జాలెం శ్రీనివాసరాజా, పోలిశెట్టి రాజేష్, అరిగెల బుజ్జి, బొరుసు రాజా, సయ్యపరాజు సత్తిబాబురాజు, నాగాబత్తుల సుబ్బారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, బొరుసు సూరిబాబు, వక్కపట్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న రాధాకృష్ణన్ చిత్రం



**మామిడికుదురు , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** విద్యార్థుల జీవితాల్లో వెలుగును ప్రసాదిస్తూ ఒక ఉపాధ్యాయుడు ఏ విధంగా కరిగి పోతాడో అనే విషయాన్ని వివరిస్తూ ఈదరాడ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ కొవ్వొత్తుపై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రంరూపొందించి అందరినీ అబ్బుర పరిచారు. టీచర్ అనే వాడు వెలుగు అనే విజ్ఞాన్ని అందిస్తూ కరిగి పోతాడు అనే ఉద్దేశం తో చిత్రం గీయడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు. ప్రధానో పాధ్యాయుడు జి.సాయిబాబా సహ ఉపాధ్యాయులు శ్రీనివాస్ కు అభినందనలు తెలిపారు.

### సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలి : ఎమ్మెల్యే గిడ్డి



**అంబాజీపేట,సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త )** అంబాజీపేటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు గణపతి వీరరాఘవులు సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. వీర రాఘవులు గత నెల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వీర రాఘవులను ఎమ్మెల్యే గిరి సత్యనారాయణ కూటమి శ్రేణులతో కలిసి గురువారం పరామర్శించి,ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు అరిగెల సూరిబాబు, అల్లాడ రవి, నాయకులు మైపాల తాతాజీ, వాసంశెట్టి కుమార్, గూడాల ఫణి, పళ్ళ దుర్గాజీ తదితరులు ఉన్నారు.

## మహిళా సంఘాలు ఆర్థిక పరిపుష్టికి ప్రణాళికలు : డిఆర్డిఏపిడి శ్రీనివాస్



**శంఖవరం , సెప్టెంబర్ 04,( ప్రభాతవార్త )** మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందని డిఆర్డిఏ పిడి బి శ్రీనివాస్ పేర్కొన్నారు ఉపప్రణాళిక ప్రాంతంలోనే వేలంగి అనుమతి గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్తులతో ప్రత్యక్షంగా సమావేశమై, మహిళా సంఘ సభ్యుల జీవనోపాధి మెరుగుపరుచుకునే దిశగా ఆర్థిక సహాయం, శిక్షణా వనరులు, సాంకేతిక పరిజ్ఞానం అందించే విధంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బి. శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సంఘాలు అభివృద్ధి చెందితే గ్రామ అభివృద్ధి సహజంగా సాధ్యమవుతుంది. చిన్న స్థాయి వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు, వృత్తి ఆధారిత శిక్షణలతో మహిళలకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ దిశగా వెలుగు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది” అని అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సంఘ సభ్యులతోపాటు గ్రామ సంఘ లీడర్లు పాల్గొన్నారు. సంఘాల అవసరాలను సమీక్షించి, కుటుంబ ఆదాయాన్ని పెంచే మార్గాలపై చర్చించారు. రూ.50 లక్షల వరకు వ్యయమయ్యే అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగింది. మహిళల సమస్యలను అవసరాలను ఉపాధి అవకాశాలపై చర్చించి తక్షణమే గిరిజన మహిళలకు అమలుచేయగల పథకాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ డిపిఎం విబి రాయ్, ఫైనాన్స్ డిపిఎం కేశవ్, ఏపిఎం శ్రీనివాస్, సీసీలు రాజబాబు, లత, రమణ, దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబీకి సత్కారం



**అమలాపురం టౌన్ , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** వినాయక నవరాత్రుల సందర్భంగా గురువారం చిందాడగరువు గ్రామంలో శ్రీ సిద్ధి బుద్ధి వినాయక ఆలయం వద్ద వినాయక నిమజ్జనం సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మండే లాబాబిని చిందాడగరువు గ్రామస్తులు సత్కరిం చారు. ఆయనకి సాలువ కప్పి పూల దండలు వేసి స్వామి వారి కండువా వేసి ఘనంగా సత్కరి ంచారు. ఈ కార్యక్రమంలో చిందాడగరువు ఎం పీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంకిరెడ్డి పెద్ద కాపు, మట్ట నాగబాబు, రంకిరెడ్డి శంకరం ,కొలి శెట్టి నాగబాబు మాదిరెడ్డి దుర్గారావు మండేల బుజ్జి, రంకిరెడ్డి పవన్ మాదిరెడ్డి వెంకట్రావు బ, డీలర్ మోటూరి సత్తిబాబు,పిల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తన కుటుంబం పై అక్రమ కేసులు బనాయిస్తే సహించేది లేదు

### వైసిపి కార్యకర్తల సమావేశంలో ముదునూరు మురళీకృష్ణ రాజు



**ప్రత్తిపాడు , సెప్టెంబర్ 04 , ( ప్రభాతవార్త ) :** కూటమి ఎమ్మెల్యే సత్యప్రభ సారధ్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ 15 నెలల వ్యవధిలోని అవినీతి అక్రమాల పుట్టగా మారిందని వైసీపీ నేత నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు ఆరోపించారు. ధర్మవరంలోని ఆయన స్వగృహం వద్ద గురువారం సాయంత్రం వైసిపి కార్యకర్తల సమావేశంలో ముదునూరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి పనిలోనూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ప్రత్తిపాడు అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిందని ఆయన మండిపడ్డారు. తన తండ్రి ఆరోగ్య స్థితి వయస్సు చూడకుండా ఒక మహిళా ఉద్యోగి అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు బనయించారని, సిగ్గు పడాల్సింది పోయి టిడిపి నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. తన భార్య గతంలో జడ్పిటిసిగా నియోజకవర్గంలో పని చేసిందని,తమ జోలికి కానీ కార్యకర్తల జోలికి గాని వస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రజల కోసం పోరాటం చేయడం కోసం తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్, సర్పంచ్ లు గోనగాని అప్పలరాజు, నడిగట్ల త్రిమూర్తులు, బోండి రాంబాబు,జువ్వల సుజాత బాబులు,నానిపల్లి సత్యవతి చంటి,వైసీపీ సీనియర్ నాయకులు జల్లిగంపల ప్రభాకర్ రావు,శెట్టి సత్యనారాయణ,కోలా తాతబాబు,జువ్వల సత్యనారాయణ,చేకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

